తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## వాకాడుకు నేడు
# సీఎం జగన్ రాక
### - ఏర్పాట్లు పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ



విద్యానగర్‌లో సీఎం హెలిప్యాడ్‌పై చర్చిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి

కోట, డిసెంబర్ 7 ప్రభాతవార్త

మిచౌంగ్ తుపాను వరద బాధితులను, ముంపునకు గురైన గ్రామాలను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామానికి రానున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆ మేరకు గురువారం కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో సీఎం హెలికాప్టర్ దిగేందుకు హెలిప్యాడ్ ఏర్పాట్లపై తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి చర్చించారు. వర్షం కురిస్తే ఈ స్థలం అనుకూలమా కాదా అని మల్లగుల్లాలు పడ్డారు. కలెక్టర్ వెంట వాకాడు ఎఎంసి ఛైర్మన్ కొడవలూరు దామోదర్‌రెడ్డి, ఆర్డీఓ కిరణ్‌కుమార్, తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ భవాని, ఇతర అధికారులు ఉన్నారు.

## సిఎం పర్యటన ఏర్పాట్లపై
# కలెక్టర్ సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

వాకాడు, డిసెంబర్ 7, ప్రభాతవార్త

వాకాడు మండలంలో శుక్రవారం తుఫాను వరదలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన ఏర్పాట్లపై గురువారం జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి వాకాడులో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు మండలంలోని బాలి రెడ్డిపాలెం గ్రామానికి వెళ్లి స్వర్ణముఖికి పడిన గండిని దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించారు. నష్టాలు వివరాలను స్థానిక నేత, వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోదర్ రెడ్డి అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాకాడుకి చేరుకుని ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ విప్ మంత్రి మేరిగ మురళీధర్, రాష్ట్ర కమిటీ డెవలప్మెంట్ బోర్డ్ ఛైర్మన్, తిరుపతి జిల్లా అధ్యక్షులు ,వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త రామ్ కుమార్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీ, జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి, గూడూరు సబ్ కలెక్టర్ ఎం. కిరణ్ కుమార్, తదితర వివిధ శాఖల అధికారులతో సిఎం పర్యటన ఏర్పాట్ల కోసం జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సిఎం జగన్ రాక కోసం విద్యానగర్‌లోని హెలిపాడ్ స్థల పరిశీలన, అలాగే అక్కడి నుంచి రోడ్డు మార్గాల బాలిరెడ్డి పాలెం గ్రామంకు చేరుకునేందుకు తగిన భద్రత ఏర్పాట్లు గురించి జిల్లా ఎస్పితో చర్చించారు. సమావేశంలో తిరుపతి జిల్లా వివిధ శాఖల అధికారులు,నాయకులు ఉన్నారు.

## అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ



పుత్తూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త : వైసిపి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. గురువారం మునిసిపాలిటీ పరిధిలోని కరకంతాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన రూ. 20 లక్షల అంచనా వ్యయంతో చెల్లెమ్మ గుడి సిసి రోడ్డు, హరిజనవాడలో డ్రైనేజి, వారియర్ స్ట్రీట్‌లో సిమెంట్ రోడ్డు పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరి మునిసిపాలిటీలో దాదాపుగా అన్ని వార్డుల్లోనూ సిసి రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నగరి మునిసిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, పలువురు కౌన్సిలర్లు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# నెర్రికాలువకు గండ్లు - రైతన్నలకు కడగండ్లు

తడ, డిసెంబర్ 7 ప్రభాతవార్త

పంట పొలాలకు, చెరువులకు నీటిని తీసుకొచ్చే నెర్రి కాలువ పలుచోట్ల గండ్లు పడి నీటి సరఫరా నిలిచిపోయింది. దొరవారిసత్రం మండలం తనియాలి నుంచి మొదలయ్యే ఈ కాలువ సూళ్లూరుపేట, తడ మండలాల మీదుగా ప్రవహిస్తుంటుంది. కనీసం 20 వేల ఎకరాల ఆయకట్టు కలిగిన అతి ముఖ్య సాగునీటి వనరుగా ఉన్న ఈ కాలువ తుపానుతో వచ్చిన వరద కారణంగా తెగిపోయింది. సూళ్లూరుపేట పట్టణం వద్ద సూళ్లూరు చెరువు సమీపంలో తడ మండలం గొల్లలమొలువు ఎదురుగా ఆరు చోట్ల కాలువకు గండ్లు పడినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం కాలువ ఈ కారణంగా నీటి ప్రవాహం లేకుండా ఎండిపోయి కనిపిస్తోంది. ఒకవైపు వరదతో కాళంగి నది, పాముల కాలువలో ఇప్పటికీ నిండి ఉంటే తెగిపోయిన పంట కాలువ ఎండిపోవడం విశేషం. ఈ కాలువ వల్ల దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాలతో పాటు తడ మండలంలోని గొల్లలమొలువు, పల్లెపాలెం, గోపాలరెడ్డిపాలెం, తోపుకండ్రిగ, పాములమిట్ట, కారిజాత, వాటంబేడు గ్రామాల రైతులు సాగు చేసుకుంటారు. అయితే ప్రస్తుతం కాలువ ఎక్కడికక్కడ తెగిపోవడంతో సరైన సమయంలో మరమ్మతులు చేస్తారా అనే అనుమానాలు రైతుల్లో ఉన్నాయి. గతంలోను కొన్ని సంఘటనలను రైతులు గుర్తు చేసుకుంటున్నారు. నిధుల్లేవని జలవనరుల శాఖ అధికారులు రైతులను సముదాయిస్తున్నట్లు తెలిసింది. వరద సమయంలో కాళంగి చెక్‌డ్యామ్‌లు ఒకేసారి ఎత్తివేయడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. అయితే తనయాలి ఆనకట్ట వద్ద సకాలంలో గేట్లు వేసేశామని, లేకుంటే కాలువ మరిన్ని చోట్ల తెగిపోయి ఉండేదని మాత్రం అధికారులు అంటున్నారు. ఎన్ని రోజులకు పునరుద్ధరిస్తామన్న



పంట కాలువ అయిన నెర్రి కాలువకు పడిన గండి

# మగ్గాల గుంటల్లో నీరు
### స్తంభించిన చేనేత పరిశ్రమ



మగ్గాల గుంటలో నీరు చేరిన దృశ్యం

వెంకటగిరి, డిసెంబర్ 7, ప్రభాతవార్త

తుఫాను కారణంగా వెంకటగిరిలోని చేనేత కార్మికులు అపార నష్టానికి గురయ్యారు. మగ్గాల గుంటల్లోకి నీరు చేరి, నూలు మొత్తం తడిసి నష్టపోయినట్లు చేనేత కార్మికులు వాపోయారు. మగ్గాలపై ఉన్న నూలు తడిసి పనికి రాకుండా పోయినట్లు తెలిపారు. పట్టణంలోని బంగారుపేట, బొప్పపురం, మనులాల పేట, బీసీ కాలనీ ప్రాంతాల్లో రివర్స్ ఎక్కువ మంది ఉన్నారు. తుఫాను వచ్చినప్పుడు తమ నష్టపోతున్నట్లు చేనేత కార్మికులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

## ఎక్కడ చూసినా విరిగిన స్తంభాలు..
# గుంతలు పడిన రోడ్లు

కోట, డిసెంబర్ 7 ప్రభాతవార్త

మిచౌంగ్ తుపాను కోట మండలాన్ని అతలాకుతలం చేసింది. ఎక్కడ చూసినా విరిగిన స్తంభాలు, గుంతలు పడిన రోడ్లు కనిపిస్తున్నాయి. రోడ్లు గుంతలు పడి వరదప్రవాహం ప్రవహిస్తోంది. ఈ తుపాను రైతులను, ప్రజలను నిలువునా ముంచింది. తుపాను ప్రజలకు కడగండ్లు మిగిల్చింది. పలు కాలనీలలోకి నీరు చేరడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతం. కాజ్‌వేలు కొట్టుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతూ గమ్యస్థానాలకు చేరుతున్నారు. రుద్రవరం, ఊనుగుంటపాలెం, గోవిందుపల్లి, పెదగోవిందుపల్లి మధ్య కల్వర్టుపై వరద ప్రవాహం జోరుగా ప్రవహించడంతో ఆ గ్రామాల మధ్య రాకపోకలు తెగిపోయాయి. అలాగే కర్లపూడిలో రెండు గిరిజన కాలనీలు, దళితవాడ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కనీసం అధికారులు గ్రామాన్ని సందర్శించేందుకు కూడా వీల్లేకుండాపోయింది. దొరువుకట్ట గ్రామం చుట్టూ వరద నీరు చేరింది. రహదారులకు గండ్లు పడటంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను తీరం దాటినప్పటికీ అది మిగిల్చిన నష్టం కర్షకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వర్షాలకు వరినాట్లు, నారుమడులు నీటిపాలయ్యాయి. అష్టకష్టాలు పడి వరినాట్లు వేసుకుంటే మునిగిపోయిన చెరువులను తలపిస్తూ పొలాలను చూస్తే రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



# ఏడుగంగమ్మల అమ్మవారికి మహా అభిషేకం
### -ముగిసిన జాతర మహోత్సవం



మహాఅభిషేకంలో పాల్గొన్న చైర్మెన్, పోలీసు సిబ్బంది

శ్రీకాళహస్తి,డిసెంబర్ 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ముత్యాలమ్మగుడిలో వెలసిన ఏడుగంగమ్మలు నిల్చుస్థలంలో నిర్మించిన ఆలయంలోమూల విరాట్టుకు వేకువ జామున నిర్వహించిన 'మహాఅభిషేకం' లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. 18సంవత్సరాలుగా శ్రీనివాసులు ఉభయకర్త అయినప్పటికి పాల్గొనే అవకాశం లభించలేదన్నారు. ఆలయంలో అర్చకులు వేదపండితులు గంగమ్మకు విశేష అభిషేకాలు నిర్వహించారు. తొలుత కలశ స్థాపన పూజలు జరిపి తరువాత షోడషాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి విశేషంగా పూలతోనూ ఆభరణాలతో అలంకారం జరిపారు.దీంతో జాతర సంబరాలు ముగిసాయి. జాతర మహోత్సవాల నిమజ్జనం కార్యక్రమంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ అంజూయాదవ్, మరియు ప్రత్యేక పోలీసు సిబ్బంది ఏడుగంగమ్మల వద్ద బందోబస్తు నిర్వహించారు. గంగమ్మల నిమజ్జనం కార్యక్రమంలో డిజె పాటలు పెట్టి ఉండడంతో భక్తి శ్రద్ధలతో జరుపుకోవాల్సిన జాతర డిజె పాటలు పెట్టడం సరికాదని ఆపివేయించారు. మహా అభిషేక ఈ కార్యక్రమాల్లో పోలసామి స్వర్ణమూర్తి, అంజూరు బాలసుబ్రమణ్యం, పగడాల రాజు, సెన్నీనరుకుప్పం శేఖర్, మొగరాల గణేష్, గరికపాటి చంద్ర, చెంచయ్య, పెంచులయ్య, బాలగౌడ్, ఏడు గంగమ్మల కమిటిల అధ్యక్షులు వేదపండితులు మోహన్‌శర్మ, అప్పాజీ శర్మలతో పాటు డిఎస్‌పి భీమారావు, సిఐ అంజూయాదవ్, పాల్గొన్నారు.

# చిట్రెడ్డిపల్లిలో చోరీ
### -నగదు నగలు అపహరణ
### -క్లూస్‌టీమ్‌చే తనిఖీ



చిందరవందరగా వున్న బీరువా, బాధితులను విచారిస్తున్న పోలీసులు

చౌడేపల్లి, డిసెంబర్ 7 ప్రభాతవార్త

చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లిలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు నగలు, నగదు దొంగలించుకొని వెళ్ళారు. మరొక ఇంటిలో ప్రయత్నం చేసి ఏమ దొరకక పోవడంతో వస్తువులను చిందర వందర చేసారు. బాధితుల కథనం మేరకు...చౌడేపల్లి పంచాయతీ చిట్రెడ్డి పల్లికి చెందిన జయశ్రీ ఇంట్లోనే వుంటోంది. బుధవారం కుప్పంలో తన సమీప బంధువు వివాహానికి వెళ్ళింది. ఇదే అదునుగా భావించిన కొందరు గుర్తు తెలియని దుండగులు రోడ్డుపక్కనే వున్న జయశ్రీ ఇంట్లోకి చొరబడి గేటు, తలుపులకు వున్న బలమైన బీగాలను పగులగొట్టి లోనికి చొరబడ్డారు. అనంతరం ఇంట్లో వున్న బీరువా తాళాలను చాకచక్యంగా తీసి అందులోని రెండు నెక్లస్‌లు, 6జతల కమ్మలు దాదాపు 50గ్రాముల బంగారం, రూ. 50వేల నగదుతో పాటు రెండు జతల వెండి కాలు పట్టీలను దొంగలించుకొని వెళ్ళినట్లు బాధితురాలు వాపోయింది. తన కుమార్తెలు కష్టపడి ఉద్యోగం చేసి సంపాధించిన బంగారం, నగదు దొంగలించుకొని వెళ్ళారని తెలిపింది. మరొక కుమార్తె ల్యాప్‌ట్యాప్ కోసం రెండు రోజుల క్రితం బ్యాంకు నుంచి తెచ్చి బీరువాలో దాచివుంచిన రూ. 50వేలను సైతం తీసుకెళ్ళారని జయశ్రీ రోదిస్తూ తెలిపింది. అదే విధంగా పక్కనే వున్న మునెమ్మకు చెందిన ఇంట్లోకి చొరబడ్డ దుండగులు అక్కడ ఏమీ దొరకక పోవడంతో వెనుతిరిగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పుంగనూరు రూరల్ సిఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీమ్ వచ్చి ఆధారాలు సేకరించుకొని వెళ్ళినట్లు, కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. కాగా మునెమ్మ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.

# యువత సైన్యంలో చేరి దేశ సేవ
### విరివిగా త్రిసాయుధ దళాల పతాక దినోత్సవంకు విరాళాలు: కలెక్టర్



చిత్తూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త:

యువత సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పిలుపునిచ్చారు. జిల్లా సచివాలయంలో గురువారం త్రి సాయుధ దళాల పతాక దినోత్సవం పురస్కరించుకొని సాయుధ దళాల అధికారుల నుండి కలెక్టర్ సగిలి షన్మోహన్ గౌరవ వందనం స్వీకరించి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ సేవలో విశిష్ట సేవలు అందించి వారి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తన మొదటి విరాళంను అందించారు. కార్యక్రమంలో సైనిక సంక్షేమ సర్వవేక్షకులు రజాక్‌ఖాన్, వెంకటప్రమోద్, కన్నా, ఎన్‌సిసి కెడేట్స్, చిత్తూరు జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు ఎం.మచంద్ర, సురేంద్రబాబు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

# ఆ ముగ్గురు దొరికారోచ్!
### క్షేమంగా నిజామాబాద్ జిల్లా కామారెడ్డిలో పోలీసుల చెంత -నేడు తిరుమలకు విద్యార్థులు

తిరుమల,డిసెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:

పాఠశాలకు వెళ్ళి పరీక్షలకు హాజరుకావలసిన ముగ్గురు తిరుమల విద్యార్థులు ఇళ్ళనుండి నగదుతో బయటకు వచ్చి పరారైన వారు ఎట్టకేలకు గురువారం ఉదయం నిజామాబాద్‌జిల్లా కామారెడ్డి రైల్వేపోలీసులకు పట్టుబడ్డారు. ముగ్గురు విద్యార్థులు ఇళ్ళలోంచి నగదుతో బుధవారం మధ్యాహ్నం పరారైన ఘటన విదితమే. పరారైన విద్యార్థులు తిరుమలనుండి బుధవారం మధ్యాహ్నం 1.40గంటలకు ఆర్టీసి బస్సులో తిరుపతికి దిగారు. అక్కడ ఓ హోటల్‌లో మాంసాహార భోజనంచేసి ఆ తరువాత సాయంత్రం రైల్వేస్టేషన్‌లో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైల్లో నిజామాబాద్ చేరుకున్నారు. అప్పటికే పత్రికల్లో, టివిల్లో పిల్లల అదృశ్యంపై వార్తలు రావడంతో రైల్వే పోలీసులు ముగ్గురు పిల్లలను అదుపులోకి తీసుకున్నారు. 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎస్,చంద్రశేఖర్(13), వైభవ్(13),శ్రీవర్ధన్(13) ముగ్గురూ కామారెడ్డిలో ఉండటంతో తల్లిదండ్రులు ఒకింత ఊపిరిపీల్చుకున్నారు. తిరుమల పోలీసులు అక్కడకు చేరుకుని శుక్రవారం ఉదయం విద్యార్థులను తీసుకువస్తున్నారు.



# భార్యను హత్య చేసిన భర్తకు యావజ్జీవం

చిత్తూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త:

మూడు ముళ్ళ బంధంతో ఏడడుగులు నడిచి పెళ్ళి చేసుకొని వచ్చిన భార్యపై అనుమానం పెనుభూతంగా మారి భార్యను హత్య చేయడంతో ఆ భర్తకు కోర్టు యావజ్జీక కారగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. 6వ అడిషనల్ సెషన్స్ జడ్జి కోర్టు 2020 సంవత్సరంలో నమోదైన హత్య కేసులో నిందితుడికి జీవత ఖైదు విధించింది. ఐరాల మండలం ఆగ్రహారం గ్రామంలో సుస్మిత(34), జగదీశ్వర్‌రెడి (40)లు భార్యభర్తలు. కొంతకాలం సాఫీగా సాగిన వీరి సంసారం ఆపై కలహాలు ప్రారంభం అయ్యాయి. భార్య సుస్మితపై అనుమానం పెంచుకొన్న భర్త జగదీశ్వర్‌రెడ్డి 25 మే 2020వ తేదీ రాత్రి వారి ఇంటి ముందే భార్య సుస్మిత గొంతును కత్తితో కోసి హత్య చేశాడు. హత్య జరిగే సమయంలో సుస్మిత వేసిన కేకలు విని అక్కడికి రాగా అప్పటికే సుస్మిత రక్తపుమడుగులో మృతి చెంది వుంది.

కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ఇన్స్‌పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి ఈ కేసును విచారించి ఒక్కరోజులోనే నిందితుడు జగదీశ్వర్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాం డ్‌కు తరలించారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం గురువారం జగదీశ్వర్‌రెడ్డికి జీవతఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన కల్లూరు ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, పిపి హిమబిందు, కోర్టుకు సకాలంలో సాక్షాలను హాజరు పరచిన కోర్టు పర్యవేక్షణ హెడ్‌కానిస్టేబుల్ మణి, కోర్టు కానిస్టేబుల్ దాములను ఎస్పీ రిశాంత్‌రెడ్డి అభినందించారు.

## గణనాధునికి వెండి పూలమాల బహూకరణ



4లో

## విజయానందరెడ్డి ఆకాంక్ష తీరాలి

– డిప్యూటీ సిఎం నారాయణస్వామి



**చిత్తూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** క్రిస్మస్, సిఎం పుట్టిన రోజు పురస్కరించుకొని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి క్రైస్తవ మత పెద్దలకు క్రిస్మస్ కానుక అందిస్తున్న ఆయన ఆకాంక్ష నెరవేరాలని డిప్యూటీ సిఎం నారాయణస్వామి పేర్కొన్నారు. చిత్తూరులోని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి నివాసంలో గురువారం డిప్యూటీ సిఎం నారాయణస్వామి చేతుల మీదుగా క్రైస్తవ మత పెద్దలకు క్రిస్మస్ కానుక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తరహాలో అన్ని వర్గాల సంక్షేమానికి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి తన పరిధిలో శాయశక్తుల కృషి చేస్తున్నారన్నారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినం, క్రిస్మస్, సంక్రాంతి పండుగలు పురస్కరించుకొని 50 వేల మంది మహిళలు, వారి భర్తలకు దుస్తులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

## నర్సింగ్ వృత్తి సేవాభావంతో కూడినది

– పిఇఎస్ వైద్య కళాశాల డీన్ డా॥ కృష్ణారావు – బిఎస్సీ నర్సింగ్..అలైడ్ సైన్స్ తరగతులు ప్రారంభం

కుప్పం, డిసెంబర్ 7 ప్రభాతవార్త



నర్సింగ్ వృత్తి సమాజం పట్ల సేవాభావంతో కూడినదని పిఇఎస్ వైద్య కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్ఆర్ కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం పిఇఎస్ ఆడిటోరియంలో 19వ బ్యాచ్ బిఎస్సీ (నర్సింగ్) 18వ బ్యాచ్ బిఎస్సీ (ఎంఎల్‌టి), 6వ బ్యాచ్ బిపిటి అలైడ్ హెల్త్ సైన్స్ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా డీన్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యను చదివే విద్యార్థినులు సేవాభావంతో పనిచేయాలని సూచించారు. కళాశాలలో ఉన్న హాస్టల్, సౌకర్యాల గురించి వివరించారు. విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు తేవాలని సూచించారు. ఎంఎస్ డా॥ సుబ్రమణ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీదేవి, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా॥ అభిరామి, కోఆర్డినేటర్ బిజేష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుప్పం రైల్వేస్టేషన్‌లో డివిజన్ రైల్వే మేనేజర్ తనిఖీలు

కుప్పం, డిసెంబర్ 7 ప్రభాతవార్త



కుప్పం రైల్వేస్టేషన్‌లో గురువారం దక్షిణ పశ్చిమ రైల్వే డివిజన్ మేనేజర్ యోగేష్ మోహన్ తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా స్టేషన్‌లో ఉన్న వసతులు, జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భం గా డిఆర్ఎంను కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, తెదేపా నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కుప్పం, మల్లానూరు, గుడుపల్లె రైల్వేస్టే షన్లలో నెలకొన్న సమస్యలను వివరించారు. అలాగే బెంగళూరు–నర్సాపురం రైలు స్టాపి ంగ్‌కై ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు రాసిన లేఖను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు సత్యేంద్రశేఖర్, బాబునాయుడు, కౌన్సిలర్ సోమశేఖర్, సుబ్బు, మణి, సతీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎద్దులపల్లి వెంకటస్వామి సేవలు మరువలేనివి

– మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

శాంతిపురం, డిసెంబర్ 7 ప్రభాతవార్త



కెనమాకులపల్లి మాజీ సర్పంచ్ ఎద్దులపల్లి వెంకటస్వామి సేవలు మరువలేనివని రాష్ట్ర అటవీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం బడుగుమాకుల పల్లిలో ఎద్దులపల్లి వెంకటస్వామి విగ్రహంను మంత్రి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటస్వామి కాంగ్రెస్ పార్టీలో మంచి నాయకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. పంచాయతీకి నిధులు వచ్చేలా బడుగుమాకులపల్లి వారపు సంతను ప్రారంభించడంతో నేటికి కూడా ఏటా పంచాయతీకి లక్షల్లో ఆదాయం వస్తోందన్నారు. గంగమ్మ ఆలయ ం నిర్మించడ ం హర్షణీయమన్నారు. అనంతరం వెంకటస్వామి భార్య పాపమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, స్టేట్ డైరెక్టర్లు పెద్దన్న, నాగమ్మ చెంగప్ప, పిఎసిఎస్ ఛైర్మన్ మునిరత్నం గౌడు, సర్పంచ్ ఎవి జయరాం, కన్వీనర్ దండపాణి, ఎంపిటిసి రకాజప్ప, విజయ్‌కుమార్, రామూర్తి, కృష్ణమూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.

## 6వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు పిపిగా తోట పురుషోత్తం

చిత్తూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త:

చిత్తూరు 6వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు పిపిగా సీనియర్ న్యాయవాది తోట పురుషోత్తంను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తోట పురుషోత్తం 6వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు పిపిగా సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ఓటింగ్ ప్రక్రియపై ప్రతి ఒక్కరికి అవగాహన

యాదమరి, డిసెంబర్ 7 ప్రభాతవార్త:

ఓటింగ్ ప్రక్రియపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలని తహసిల్దారు హనుమంతు అన్నారు. ఎలక్షన్ కమీషన్, కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశాల మేరకు ఓటర్లకు ఇవిఎం, వివి ప్యాట్లతో ఓట్లు వేసే విధానంపై గురువారం కుక్కలపల్లి, మోర్ధానపల్లి గ్రామ సచివాలయాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న తహసిల్దారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటింగ్ విధానంపై అవగాహన చేసుకొని పక్కాగా ఓటింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మండలంలోని ప్రజలకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించడానికి ఇవిఎం, వివి ప్యాట్లు వచ్చాయని వీటితో ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది వెళ్ళి ప్రజలకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, విఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓగా రామనాథరెడ్డి బాధ్యతలు స్వీకరణ

పాలసముద్రం, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



పాలసముద్రం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం.రామనాథరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రేమ్‌రాజ్‌కుమార్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పుంగనూరులో విధులు నిర్వహిస్తున్న ఎంపిడిఓ రామనాథరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రామనాథరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపిడిఓకి ఎఓ విద్యావతి, ఇఓఆర్డీ రమేష్‌బాబు, గ్రామ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రానికి దిశా దశ నిర్ధేశం

పాలసముద్రం, డిసెంబర్ 7 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రానికి దిశా దశ నిర్ధేశం సాధ్యమని మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు పేర్కొన్నారు. ఎస్ఆర్ కండ్రిగ గ్రామంలో గురువారం మండల దేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌రాజు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ విడుదల చేసిన మినీ మెనిఫెస్టోలోని అంశాలపై పూర్తి స్థాయిలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ష్యూరిటీ బాండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు విజయ్‌కుమార్, ఆరుళ్‌నాధన్, సాంబశివన్, కృష్ణయ్యనాయుడు, వెంకటప్పనాయుడు, వెంకటేశులు, లక్ష్మమ్మ, రంజిత్‌కుమార్, ఎలుమలై, అవినాష్, సుబ్రమణ్యం, రాఘవులు, అయ్యప్పన్, టి.ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరం న్యాయం

– సిపిఐ ఆధ్వర్యంలో తహసిల్దారు కార్యాలయం ఎదుట దీక్షలు

చిత్తూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



అగ్రిగోల్డ్ సంస్థ బారిన పడి సర్వం కోల్పోయిన బాధితులకు సత్వరం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తహసిల్దారు కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను ఉద్దేశించిన జిల్లా సిపిఐ నాయకుడు నాగరాజు మాట్లాడుతూ ప్రతిపక్షంలో వున్నప్పుడు ప్రస్తుత సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, అయితే నాలుగున్నర సంవత్సరాలు అధికారం చెలాయించినా సిఎం వైఎస్ జగన్ ఇప్పటి వరకు అగ్రిగోల్డ్ బాధితులకు ఎలాంటి న్యాయం చేయలేదని ధ్వజమెత్తారు. అగ్రిగోల్డ్ సంస్థ బాధితులకు ప్రభుత్వం సత్వర న్యాయం చేయకుంటే ఈ నెల 18వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలకు ఆయన పిలుపునిచ్చారు. అగ్రిగోల్డ్ సంస్థ బాధితులు హబీబుల్లా, గోవర్ధన్, గిరిధర్, చంద్రశేఖర్, సిపిఐ నాయకులు విసి గోపినాథ్, దాసరి చంద్ర, రమాదేవి, లతారెడ్డి, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి కుప్పం మున్సిపల్ అభివృద్ధి పనులు

– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పంరూరల్, డిసెంబర్ 7 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ పరిధిలోని 25 వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ తీసుకెళ్లారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కేటాయించిన 66కోట్ల నిధుల్లో భాగంగా ప్రతి వార్డులో రెండుకోట్ల అంచనాతో పనులు మొదలుపెట్టామని పలువార్డుల్లో పనులు జరుగుతున్నాయన్నారు. దాదాపు మూడుకోట్ల వ్యయంతో నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మిస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ అభివృద్ధికి మరింత సహకారం అందించి సమస్యల పరిష్కారంకు కృషి చేయాలని మంత్రిని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కేంద్ర పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

తవణంపల్లె, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



పేద ప్రజల సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌లు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అర్హులందరికి ఈపథకాలు అందించేందుకు వీలుగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంను మండలంలోని జొన్నగురకల, నల్లిశెట్టిపల్లె గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం సుమారు 140 రకాల పథకాలను కోట్లాది రూపాయల వ్యయంతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈపథకాల గురించి వివరిస్తూ వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రవీణ్, ఇండియన్ బ్యాంకు మేనేజర్ సిద్దార్థ్, బిజెపీ జిల్లా ఉపాధ్యక్షుడు కెవి.చంద్రమోహన్, నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రకాష్, కో.కన్వీనర్ దుర్గాప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.బాలచంద్ర యాదవ్, నాయకులు జయప్రకాష్, ఆనందబాబు, శ్రీనివాసులులతో పాటు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కరువు ప్రభావిత ప్రాంతాల పరిశీలన

రొంపిచెర్ల, డిసెంబరు 7 ప్రభాతవార్త:



మండల పరిదిలోని కరువు ప్రభావిత ప్రాంతాలను జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ గురువారం సందర్శించారు. ఖరీఫ్ 2023కు సంబందించి గానుగచింత, రొంపిచెర్ల గ్రామాలలో పర్యటించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. అదేవిధంగా రొంపిచెర్ల రైతుభరోసా కేంద్రంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రబీ సాగు విస్తీర్ణం, ఈ–క్రాప్ బుకింగ్,లను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామ స్థాయి వ్యవసాయ సాంకేతిక సమావేశములు పరిశీలించిసూచనలుఇచ్చారు. సమావేశంలోడివిజన వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్, వనరుల కేంద్రం అధికారి నాగపద్మిని, వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న, సుధారాణి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐగా రామ్మోహన్ బాధ్యతలు స్వీకరణ

గుడిపాల, డిసెంబర్ 7 ప్రభాతవార్త:

గుడిపాల ఎస్ఐగా రామ్మోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుడిపాల ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌రెడ్డి బదిలీపై అలిపిరి పోలీస్ స్టేషన్‌కు వెళ్ళడంతో గత కొంతకాలంగా ఎస్ఐ పోస్టు ఖాళీగా వుంది. ఈ మేరకు బి.కొత్తకోట ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రామ్మోహన్‌ను గుడిపాల ఎస్ఐగా నియమిస్తూ ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

## ఓటింగ్ ప్రక్రియపై ప్రతి ఒక్కరికి అవగాహన

గుడిపాల, డిసెంబర్ 7 ప్రభాతవార్త:

ఓటింగ్ ప్రక్రియపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలని తహసిల్దారు బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. ఎన్నికల సంఘం, కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు ఓటు ఎలా వేయాలో ప్రజలకు వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని ఓటు వేసే విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దారు కళ్యాణి, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## హెడ్మాస్టర్ మనోహర్‌నాయుడుకు అబ్దుల్ కలాం అవార్డు



పాలసముద్రం, డిసెంబర్ 7 ప్రభాతవార్త:

మండలంలోని కృష్ణ జిమ్మాపురం పంచాయతీ ఎస్ఆర్ కండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ మనోహర్‌నాయుడు ఎపిజె అబ్దుల్ కలాం అవార్డు అందుకొన్నారు. విజయవాడలో ఆదివారం హనుమంత రాయ గ్రంథా లయంలోఎక్సరే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎపి ప్లానింగ్ కమీషన్ వైస్ ఛైర్మన్ మల్లాది విష్ణు ఈ అవార్డును హెడ్మాస్టర్ మనోహర్‌నాయుడుకు అందజేశారు. ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని హెడ్మాస్టర్ మనోహర్‌నాయుడును రాష్ట్ర ప్రభుత్వం

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## బాధితులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే



వాకాడు, డిసెంబర్ 7, ప్రభాతవార్త

మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో నదిలోకి ఇల్లులు కొట్టుకుపోయిన బాధితులను గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఓదార్చారు. గురువారం వాకాడు మండలం బాలిరెడ్డి పాలెం గ్రామంలోని సునీల్ కుమార్ పర్యటించి మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో స్వర్ణముఖి నది గండిపడి ఇల్లు కొట్టుకుని వారందరికీ ఐదు సెంట్లు ఇంటి స్థలంతో పాటు రానున్న టిడిపి ప్రభుత్వం వస్తే గృహాలు నిర్మిస్తామని వారికి భరోసా ఇచ్చారు. బాలిరెడ్డి పాలెం గ్రామంలోని తెలుగువాడ ప్రజలను ఆయన కలుసుకున్నారు. ప్రస్తుతం తాను మాజీ ఎమ్మెల్యే అని, ప్రతిపక్షంలో ఉన్నామని వారికి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అతీతంగా నష్టపోయిన వారందరికీ ఇంటికి 10000 రూపాయిలు, దెబ్బతిన్న రైతు పొలాలకు20000 రూపాయిలు తక్షణమే ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ముఖ్యంగా ఇప్పటి వరకు పేదలకు నిత్యవసర సరుకులు రేషన్ ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. అధికార యంత్రాంగం ఎక్కడుందని ఆయన విమర్శించారు. గూడూరు నియోజకవర్గం అన్ని మండలాల్లో వరద తాకిడికి గురై అనేక ఇబ్బందులు పడ్డారని వారందరికీ తక్షణమే ఇంటికి పదివేల చొప్పున ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మండలంలోని ముట్టెంబాక, తిరుమూరు, వాకాడు బీసీ కాలనీ, మసీదు కాలనీ ఆయన తిరిగారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ మధుసూధన్ రెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యురాలు ప్రమీల, నాయకులు అన్నమేటి చంద్రయ్య, నెల్లూరు సుధాకర్ రెడ్డి, కుంచం దయాకర్, అరుణ్ కుమార్, మామిడి గోవిందయ్య, పొలయ్య, రమణయ్య తదితరులు ఉన్నారు. అనంతరం ఇట్లు కొట్టుకపోయిన బాధితులకు సునీల్ కుమార్ చేతులు మీదుగా ఆర్థిక సహాయం అందజేసారు.

## సిఎం గారు.. రొయ్యల రైతులను ఆదుకోవాలి

మాజీ జల సంఘం అధ్యక్షులు దువ్వూరు వెంకటరమణారెడ్డి

కోట, డిసెంబర్ 7, ప్రభాతవార్త

తుపాను కారణంగా రొయ్యల రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలిందని కోట మండల పుచ్చలపల్లి గ్రామ మాజీ జలసంఘం అధ్యక్షులు దువ్వూరు వెంకటరమణారెడ్డి చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోట, వాకాడు, చిల్లకూరు, చిట్టమూరు మండలాల్లోని రొయ్యల గుంటల సాగు చేసి చివరి దశలోఉన్నరొయ్యలుఅంతావరదప్రవాహంతోకొట్టుకునిపోవడంతోకోట్లాదిరూపాయిలునీళ్ళలల్లో పోసినట్లయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. నేడు వాకాడుకు వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిరొయ్యలరైతులబాధలనుఅర్ధంచేసుకుని, రొయ్యల రైతులను ఆదుకోవాలని వెంకటరమణారెడ్డి కోరారు.

## ఆర్డీఓ కృషి అభినందనీయం

దువ్వూరు వెంకటరమణారెడ్డి

కోట, డిసెంబర్ 7, ప్రభాతవార్త

మీచౌంగ్ తుఫాన్ భారీ వర్షాలు, వరదల్లోనూ కోట మండలంలోని దొరువుకట్ట, దైవాలదిబ్బ, పుచ్చలపల్లి గ్రామాల్లో రవాణా సౌకర్యం లేకపోయినా సాహసోపేతంగా వ్యవహరించి కాలనీలలో విస్తృతంగా పర్యటించి వరదల్లో చిక్కుకున్న వారిని రెస్క్యూ ఆపరేషన్‌తో సురక్షితంగా రక్షించిన గూడూరు ఆర్డిఓ కిరణ్ కుమార్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కోట మండల అధికార యంత్రాంగాన్ని వెంట బెట్టుకుని సెల్‌ఫోన్లు మూగబోయినప్పటికీ క్షేత్ర స్థాయి సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తంగా చేస్తూ సంపూర్ణ సహాయ సహకారాలు అందించి అవిశ్రాంతంగా శ్రమించిన ఆర్డిఓ కిరణ్ కుమార్‌కు ఋణపడి ఉంటామన్నారు. అలుపెరగకుండా ఆర్డిఓ చేసిన సేవలు అనిర్వచనీయమన్నారు. ఆయనతో పాటు కోట మండల తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ భవాని, పోలీస్ సిబ్బంది, గ్రామ సచివాలయం, వాలంటీర్లకు మాజీ జల సంఘం అధ్యక్షుడు దువ్వూరు వెంకటరమణా రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## గాయపడ్డ వ్యక్తికి ఆర్థిక సహాయం

కోట, డిసెంబర్ 7, ప్రభాతవార్త

కోట పట్టణానికి చెందిన వల్లంసాయి కృష్ణా ఇటీవల రోడ్డు ప్రమాదంలో బైక్ పై నుంచి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో నెల్లూరులోని వైద్య చికిత్సలు పొందుతున్నారు. ఆ మేరకు వైద్య ఖర్చుల కింద టిడిపి జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ ఆహ్మద్, బాధితులు తండ్రి వల్లం ప్రదీప్‌కు గురువారం 30 వేల రూపాయలను ఆర్థిక సాయం అందజేసారు. ఈకార్యక్రమంలో తేదేపా పట్టణ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, తీగల సురేష్ బాబు, ఎంపిటిసి సురేష్, నౌషాద్, ఎం. పోలయ్యలు ఉన్నారు.

## తుఫాను బాధితులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు

గూడూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త

మిచౌంగ్ తుఫాను అతలాకుతలం చేసిందని, అన్నీ శాఖల అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, స్వచ్ఛఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని పురపాలక కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో వారు తుఫాను ప్రభావంపై సమీక్షించారు. తుఫాను కారణంగా నియోజకవర్గంతో పాటు గూడూరు పట్టణంలో అపార నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో పట్టణంలోని పురపాలక కార్యాలయంలో ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, స్వచ్ఛ ఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ, వైకాపా సిఈసి సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి వివిధ శాఖల అధికారులతో నష్టం అంచనాపై సమీక్షించారు. ఏయే ప్రాంతాలు దెబ్బతిన్నాయో పనులు ఎంత వరకు చేశారో అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ తుపాను



కారణంగా పంటలు దెబ్బతిన్నాయన్నారు. పలు గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయని, సిఎం జగన్మోహన్ రెడ్డి వాకాడు మండలంలో ఏరియాలు సర్వే చేపడుతారన్నారు. నష్టపోయిన వారందరినీ ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. వాటర్ ప్లాంట్‌ల నిర్వాహకులు తాగునీటిని అధిక మొత్తానికి విక్రయిస్తున్నారని, నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించామని పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ దేవసేనమ్మ మాట్లాడుతూ తుఫాను కారణంగా గూడూరు అతలాకుతలమైందన్నారు. విద్యుత్, ఇతర శాఖల అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారని, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రధానంగా సొసైటీ, ఆర్టిసి తదితర ప్రాంతాలు బాగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. విద్యుత్ సమస్య కారణంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని ప్రజలకు అందిస్తున్నారన్నారు. వీలైనంత త్వరితగతిన సాధారణ పరిస్థితులు నెలకొంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, కోడూరు మీరారెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్, అజీజ్ ఖాన్, మురళి, ఆల్తాఫ్, కమిషనర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

బాజాపా నాయకులు

కోట, డిసెంబర్ 7, ప్రభాతవార్త



గూడూరు నియోజకవర్గంలో తుపాను వల్ల నష్టపోయిన రైతులును వెంటనే ఆదుకోవాలని బాజాపా రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి సురేంద్రనాథ్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అవిలాష్, మండల శాఖ అధ్యక్షులు డా. సారంగం రమేష్ బాబులు కోరారు. వారు గురువారం కోట మండలంలోని కొక్కుపాడు, ఉచ్చువారిపాలెం, ఉత్తయనెల్లూరు, చికళ్ల దిబ్బ, దొరువుకట్ట గోవిందపల్లి, సిద్దవరం తదితర గ్రామాలల్లో రొయ్యల గుంటలను పరిశీలించారు. రొయ్యల రైతులు లక్షలాది రూపాయిలు నష్టపోయారని పేర్కొన్నారు. శుక్రవారం వాకాడు మండలంలో పర్యటించనున్న సిఎం జగన్మోహన్ రెడ్డి వరదప్రవాహంలో కొట్టుకుపోయిన నష్టాపోయిన రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

## సిఎం జగన్ పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వాకాడు, డిసెంబర్ 7, ప్రభాతవార్త



వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామానికి రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రానున్నడంతో గురువారం గూడూరు శాసనసభ్యులు డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్ రావు సిఎం సందర్శించు ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట వాకాడు సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కల్లూరు సర్పంచి విజయభాస్కర్ రెడ్డి, పంచాయితీ రాజ్ ఇంజనీర్లు, విజయ్ నంద దయాల్, కిరణ్, వివిధ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్ళు దగ్ధం

గూడూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త

గూడూరు స్థానిక నల్లజాలమ్మ వీధి నందు ఎస్‌కె యాసిన్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో 1,40,000 విలువ చేసే వస్తువులు కాలిపోవడం జరిగింది. ఏసి, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, మిక్సీ వంటి వస్తువులు కాలిపోవడంతోలబోదిబో అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసిన్ ప్లంబర్‌గా పనిచేస్తూ జీవనంసాగిస్తుంటూ. ఆస్తి నష్టం జరిగాక ఏం చేయాలో తెలియని పరిస్థితిలో బాధితులు ఉన్నారు.

## పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త

గూడూరు ప్రగతి సేవా సంస్థ ఇన్నర్ వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో సంయుక్తంగా ప్రతి నెల 7వ తేది గూడూరు ఆర్‌డిఓ ఆఫీస్ ఆవరణంలో పేద ప్రజలందరూ దేవుళ్ళుగా భావిస్తున్న డాక్టర్ సిఆర్ రెడ్డి పేరు మీద డా. సిఆర్ రెడ్డి ఆరోగ్య సంజీవని అనే కార్యక్రమం ద్వారా పేద ప్రజలు డాక్టర్ జనార్ధన్ రెడ్డి, డా. రోహిణి సంపూర్ణ సహాయ సహకారాలతో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల జీవన ప్రమాణాలు పెంచడం కోసం ఎయిడ్స్ వ్యాధి బాధితులు అయిన 30 మందికి ప్రతి నెల పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన డా. రోహిణి చేతుల మీదుగా పంపిణీ చేసారు. అనంతరం ఒక సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా వ్యాధి గ్రస్తులకు చలికాలం దృష్టిలో ఉంచుకుని 50 మందికి దుప్పట్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు విష్ణు వందన, ఆంధ్ర మహిళా మండలి ఫాస్ట్ ప్రెసిడెంట్ స్నేహలత, లక్ష్మీ, ఎన్ఎన్‌పి ప్రెసిడెంట్ వి. ధనుర్జా, కోఆర్డినేటర్ దామోదర్, పి. వెంకటేశ్వర్లు, ప్రగతి సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, సెక్రెటరీ చంద్రశేఖర్ సెక్రెటరీ చంద్రశేఖర్, కుటుంబ సభ్యులు శ్రీ చైనత్య స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు ,వాకాటి రామ్మోహన్, పురందర రాజు, శివాని స్టడీ సర్కిల్ శివకుమార్ రెడ్డి, కెఆర్ఎం ఆర్‌వి కన్స్ట్రక్షన్ వెంకటకృష్ణయ్య, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజెపి సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోండి

ఎకరాకు రూ. 30 వేలు చొప్పున ఇవ్వండి
గూడూరులో విద్యుత్తుని పునరావృతం చేయండి
కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డిఓ కార్యాలయం ఎదుట నిరసన

గూడూరు, డిసెంబర్ 7, ప్రభాతవార్త

గూడూరు ఆర్డిఓ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు పంట శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆర్డివో లేకపోవడంతో ఏవో అధికారికి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫానుతో నిమ్మ, సవక, బొప్పాయి, వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారి నష్టపరిహారంగా ఎకరాకు 30 వేల రూపాయిలు ఇచ్చి రైతులని ఆదుకోవాలని అంతే కాకుండా గూడూరు పరిసర ప్రాంతంలో విద్యుత్ సరిగా లేకపోవడం వల్ల నీటికి పడుతున్న ఇబ్బందులు కష్టాలు అన్ని ఇన్ని కావు మున్సిపాలిటీ నుంచి రావాల్సిన నీరు కూడా రావడం లేదని గూడూరు పట్టణ ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. అలాగే సిపిఎం పార్టీ నాయకులు డిప్యూటీ తహశీల్దార్‌కి మిచౌంగ్ తుఫాన్



కారణంగా తీవ్రంగా నష్టపోయిన నిరాశ్రయులకు, రైతులకు నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని గురువారం సాయంత్రం గూడూరు ఎమ్మార్వోని కలిసి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తుఫాను కారణంగా గూడూరు మండలంలోని చుట్టు పక్కల గ్రామాల్లో ఉన్న ప్రజలు చాలా మంది నిరాశ్రయులు కావడం తీవ్రంగా నష్టపోవడం జరిగింది. ఇళ్లల్లో వరద నీరు చేరుకోవడంతో ఉన్న పొప్పు దినుసులు, బియ్యం, పిల్లలు చదువుకునే పుస్తకాలు తదితర ఎలక్ట్రికల్ వస్తువులు, మొత్తం వరద తాకిడికి కొట్టుకుపోవడం జరిగిందని బాధితులు తినడానికి తిండి లేక, కట్టుకునేదానికి బట్టలేక, నానా ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన పునరావృతం చేసి గూడూరు ప్రజలను ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు మండలం ప్రెసిడెంట్ వేమయ్య, గూడూరు మండల ప్రెసిడెంట్ బండి భాస్కర్ రెడ్డి, దర్శి నాగభూషణం, శ్రీహరి, సిపిఎం సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, బివి రమణయ్య , ఎస్. సురేష్, బి. గోపినాధ్, అడపాల ప్రసాద్, నారాయణ, బి. చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొత్త ఓటర్ల నమోదు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త



జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోటా ఆధ్వర్యంలో గురువారం కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా డిసెంబర్ 9న కొత్త ఓటరు నమోదు ప్రక్రియకు చివరి రోజు గడువు కావడంతో జనసేన పారీట వినుత కోట ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసి బస్టాండు వద్ద ప్రత్యేక క్యాంపును నిర్వహించి విద్యార్థులు, అర్హత ఉన్న ప్రజలకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించి జనసేన పార్టీ ఐటి సభ్యుల ద్వారా ఓటులేని వారికి ఓటరు నమోదు చేశారు. అలాగే ప్రజలకు తమ ఓటు ఉందో లేదో పరిశీలించుకునే అవగాన కల్పించాలన్నారు. అలాగే ప్రజలకు తమ ఓటుతో ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధంతో ప్రజల తలరాతలు నిర్దేశిస్తుందని ఓటు విలువ అందరు గ్రహించాలని తెలిపారు. ప్రతి ఒక్కరు డిసెంబర్ 9 తేదీ లోపు ఓట్లు నమోదు చేసుకోవాలని మార్పులు, చేర్పులు ఉంటే చేసుకోవాలని, అలాగే ఓటరు జాబితాలో దొంగ ఓట్లు ఉన్నట్లయితే అభ్యంతరాలు తెలపాలని గ్రామ, వార్డు స్థాయిలో జనసేన నాయకులు, జనసైనికులు పరిశీలించి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు.

## యువనేస్తం ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్), డిసెంబర్ 7 ప్రభాతవార్త



యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం శ్రీకాళహస్తి మండలంలోని భైరవ ఎస్టీ కాలనీలో నివాసం ఉంటునన రెండు కుటుంబాల పరిస్థితి దీనంగా మారడంతో వారికి యువనేస్తం తరపున 25కిలోల చొప్పున బియ్యం, నిత్యావసర సరుకుల, కూరగాయలును దాతల సాయంతో అందించారు. యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మునిశేఖర్ మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా పడడంతో భైరవ ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న బుజ్జమ్మ మరియు వసతి మమత కుటుంబాలకు కూలి పని లేక ఆర్థిక పరిస్థితి బాగోలేక పూట గడవడానికి కష్టంగా ఉందని తెలుసుకుని యువనేస్తం తరపున వారికి సాయం చేశామన్నారు. కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ మండల కో ఆర్డినేటర్ నాగమణి, వాలంటీర్లు వెంకటేష్, హేమ తదితరులు పాల్గొన్నారు.

## సీతారామాలయ నిర్మాణానికి భూమిపూజ

తొట్టంబేడు, డిసెంబర్ 7 ప్రభాతవార్త



మండలంలోని శివనాధపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాలయం నిర్మాణానికి గురువారం ఎంఎల్‌ఏ తనయ బియ్యపుపవిత్రారెడ్డి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పవిత్రారెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతున్నా యని తెలిపారు. భావితరాల వారికి మన ఆధ్యాత్మిక సంపదను తెలియజేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాశ్చాత్య దేశాల్లో ఇలాంటి సంప్రదాయాలు కనిపించవని అన్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో వందలాది ఆలయాల నిర్మాణాలకు ఒక్కొక్క ఆలయానికి కనీసం రూ.10లక్షలు తగ్గకుండా ఎంఎల్‌ఏ తెలిపారు. ఆలయాల నిర్మాణాలను శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. తిరిగి కొత్తగా నియోజకవర్గంలో 40 గ్రామాల్లో ఆలయ నిర్మాణాలకు నూతనంగా నిధులు మంజూరు చేయించారని అవి కూడా త్వరలో నిర్మాణాలు జరగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, రాజ్ ప్రకాష్, దామోదరం, బాలాజీమేస్త్రీ, రంగయ్య, వెంకయ్య, దేవి, లలితమ్మ, సుగుణ గ్రామస్తులు పాల్గొన్నారు.

## అందరివాడుగా అంబేద్కర్ శ్రీశైలం ట్రస్టు బోర్డు చేర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి

నింద్ర,డిసెంబరు 07 ప్రభాతవార్త :



దేశంలోని అన్ని వర్గాల వారితో అందరివాడగా పేరు తెచ్చుకున్నారని శ్రీశైలం ట్రస్టు బోర్డు చేర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు.బుధవారం మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 67వ వర్ధంతి పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించినారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి రాజ్యాంగం రాయడానికి ముఖ్యభూమిక పోషించి పేద,ధనిక అనే తారతమ్యం లేకుండా అందరికి సమాన ప్రాతినిధ్యం వహించే విధంగా రాజ్యాంగం రచించినారని తెలిపారు.యస్‌సి,యస్‌టి,బిసి,మైనార్టీలకే కాకుండా దేశంలోని అన్ని పేదరికాన్ని నిర్మూలించడానికి వారి కోసం అనేక చట్టాలను తీసుకొని వచ్చిన్నట్లు ఆయన తెలిపారు.అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పేదలకు అన్నదానం చేసినారు.ఈకార్యక్రమంలో జడ్పీటిసి మల్లీశ్వరి పరందామరెడ్డి,ఎంపిడిఓ అరుణ,యంపిటిసి రెడ్డివారి భాస్కర్‌రెడ్డి,సర్పంచ్‌లు బాలకృష్ణమరాజు,సూర్య,నాయకులు మల్లికార్జునాయుడు,నాగభూషణంరాజు,తిరుమల,రాజ్‌కుమార్,శివయ్య,ధశరధనాయుడు,వినయ్‌కువ ర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు మరమ్మతులు నిర్వహించండి

విజయపురం, డిసెంబరు 7 ప్రభాతవార్త :



మండలంలో మిచౌంగ్ తుపాను వల్ల పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని మల్లారెడ్డికండ్రిగ బిసి కాలనీ గూలూరు మార్గ మధ్యంలో వరద నీటితో రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా వుందని వాపోతున్నారు. మండలంలోని విజయపురం దళితవాడ మలుపు వద్ద, కృష్ణసముద్రం చెరువు కట్ట, ఒరురు, ఆలపాకండ్రిగ వద్ద రోడ్లు దుస్థితిలో వున్నాయని వీటిని మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

## పన్నూరులో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

విజయపురం డిసెంబరు 7 ప్రభాతవార్త :



మండలంలోని పన్నూరు ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ హరిప్రసాద్ మాట్లాడుతూ దివ్యాంగులు మానసికంగా ధృడంగా వుంటారని, వారు అందరితో సమానమని తెలిపారు. అనంతరం దివ్యాంగ పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జానకిరామరెడ్డి, ఐఇఆర్టి రిసోర్స్‌పర్సన్ శివకుమార్, పుష్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ గంగమాంబ విగ్రహ ప్రతిష్ట

శాంతిపురం, డిసెంబర్ 7 ప్రభాతవార్త

మండలంలోని రాళ్లబూదుగూరులో నూతనంగా నిర్మించిన శ్రీ ఈశి గంగమాంబ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘన ంగా ప్రారంభమైంది. గురువారం గణపతిపూజ, హోమాలు, శయనివాసం కార్యక్రమాలు జరిగాయి. శుక్రవారం ప్రాణ ప్రతిష్ట, నాడీసంధానం, పూర్ణాహుతి,ప్రతిష్టాపన హోమాలు, అన్నదానం కార్యక్రమాలు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో పూజారి అప్పన్నస్వామి పాల్గొన్నారు.

## బైపాస్ రోడ్డుకోసం రెవెన్యూ కార్యాలయం ముట్టడి

వి.కోట, డిసెంబర్ 7 ప్రభాతవార్త



మూడు రాష్ట్రాల కూడలిలో ఉన్న వి.కోట మీదుగా మంజూరైన నాలుగులైన్ల బైపాస్ రోడ్‌ను తుడుస్తున్నారని వేదనతో తెలుగుదేశం పార్టీ నేతలు గురువారం రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించారు. బైపాస్ రోడ్డుతో భూములు కోల్పోయే రైతులతో సభ నిర్వహణకు అర్జీ ఇచ్చారు. దీంతో దేశం నేతలు తహశీల్దార్ కార్యాలయంకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. బైపాస్ రోడ్ కు కర్ణాటక ప్రాంతంలో ఉన్న కొంతమంది లబ్ది కొసం అలైన్‌మెంట్ మార్చడం దారుణమన్నారు. అలైన్‌మెంట్ మార్చిన ద్రోహులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కాగా అభ్యంతరాలపై వివరాలు అందిస్తే ఉన్నతాధికారులకు పంపి తగు చర్యలు తీసుకుంటామని అర్జీ పేర్కొన్నారు. అనంతరం దేశం, బిజెపి నేతలు వినతిపత్రం అందించారు.

## అత్యాధునిక టెక్నాలజీ ఆర్వి డిజిటల్స్ సొంతం

### దేశంలో మొట్టమొదటి రెటరియా ఈసీ 1100 యంత్రం ఆర్వీలో ప్రారంభం

తిరుపతి టౌన్, డిసెంబర్ 7, ప్రభాతవార్త



దేశంలోని ప్రముఖ కార్పొరేట్ కంపెనీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలు, నియోజకవర్గం కేంద్రాలు, మున్సిపల్ కార్పొరేషన్ కేంద్రాలలో తమ అత్యాధునిక టెక్నాలజీతో వినియోగదారులకు కంపెనీ ఉత్పత్తులను ఆకర్షణీయ రీతిలో డిజిటల్ డిజైన్స్ ప్రింటింగ్ చేసి పబ్లిసిటీ ఇస్తున్న ఆర్వి డిజిటల్స్ దేశంలోని మొట్టమొదటి సారిగా అత్యాధునిక టెక్నాలజీతో ఫుజీ ఫిలిం సంస్థ రూపొందించిన రెటరియా ఈసీ 1100 నూతన యంత్రాన్ని ప్రారంభించారు. గురువారం తిరుపతి - కరకంబాడి మార్గంలోని మంగళం రవాణా శాఖ కూడలి వద్ద గల ఆర్వి డిజిటల్స్ ప్రధాన కార్యాలయంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాధాకృష్ణ, ఫుజి ఫిలిం సంస్థ ప్రతినిదులు హాజరై రెటరియా ఈసీ 1100 నూతన యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్వి డిజిటల్స్ ఎండి రాధాకృష్ణ మీడియాతో మాట్లాడుతూ గత 30 సంవత్సరాల అనుభవంతో డిజిటల్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆర్వి డిజిటల్స్‌లో తగిన మార్పులు చేసుకుంటూ ప్రారంభించిన మూడున్నర సంవత్సరాలలోనే తిరుపతి నుండి రాయలసీమ, ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్పొరేట్ సంస్థలకు సంబంధించిన గ్లోసైన్ బోర్డ్స్, ఎల్ఈడి బోర్డ్స్, ఫ్యాబ్రిక్ బోర్డ్స్, షోరూం డిస్ప్లే, క్లాడింగ్ వర్క్స్, కంప్లీట్ బ్రాండింగ్‌లను ఆర్వి డిజిటల్స్‌లో తయారు చేస్తున్నామన్నారు. ఫుజి ఫిలం సంస్థ రూపొందించిన అత్యాధునిక టెక్నాలజీతో రెటరియా ఈసీ 1100 యంత్రాన్ని 60 లక్షలు వెచ్చించి జపాన్ దేశం నుంచి దిగుమతి చేసుకున్నామన్నారు. ఈ యంత్ర సహాయంతో ఒక నిమిషానికి 100 షీట్లను ఆకర్షణీయంగా డిజిటల్ ప్రింటింగ్ చేయొచ్చన్నారు. ఆర్వి డిజిటల్స్ సేవలు ఉపయోగించుకుంటూ వ్యాపార అభివృద్ధి చేసుకోవాలని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాధాకృష్ణ విజ్ఞప్తి చేసారు.

## సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీచేసిన ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త





నియోజకవర్గంలో పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం పార్టీ కార్యాలంలో ప్రజల మనిషి, ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి వారికి చెక్కులను అందించారు. ఈసందర్భంగా శ్రీకాళహస్తి మండలం ఎంపేడు గ్రామానికి చెందిన ఎన్.ఉషకు రూ.30వేల చెక్కును అలాగే రేణిగుంట మండలం దొడ్లమిట్టకు చెందిన మునిరెడ్డికి రూ.3లక్షల చెక్కును అందించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ఓవైపు ఆరోగ్యశ్రీ పథకంలో రాష్ట్రంలో ఎంతో మంది పేదలకు ఉచిత వైద్యసేవలు పొందుతుంటే సిఎంఆర్ఎఫ్ పథకం కింద జగనన్న ఎంతోమందికి సహాయం చేస్తూ బాసటగానిలుస్తూండడం దేశంలోనే ఆదర్శనీయం అన్నారు.కార్యక్రమంలో బోర్డు సభ్యులు భాస్కర్, సచివాలయ కన్వీనర్ మల్లికార్జునగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**శబరిమలయాత్రకు ఎంఎల్ఏ సాయం..**

పట్టణానికి చెందిన అయ్యప్పభక్తులకు శబరిమల యాత్రకు వెళ్ళడానికి కావాల్సిన రవాణా మరియు భోజన సదుపాయాలు నిమిత్తం గురువారం పార్టీ కార్యాలయంలో ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డికి రూ.లక్ష నగదును అందించారు. ఎంతో భక్తిశ్రద్దలతో అయ్యప్పభక్తులు మాల ధరించి నియమనిష్టలతో ఉంటూ స్వామివారి దర్శనానికి వెళ్తున్న వారికి సాయం చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందని ఎంఎల్ఏ తెలిపారు.

## శివయ్య సన్నిధిలో విశ్రాంత ఐఏఎస్ అధికారి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి గురువారం తెలంగాణా రాష్ట్ర విశ్రాంత ఐఏఎస్ బీపి ఆచార్య విచ్చేశారు. ఈసందర్భంగా శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరుతారకశ్రీనివాసులు ఆలయమర్యాదలతోస్వాగతంపలికారు. అనంతరం ఆయనకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనం నిర్వహించుకోవడంతో పాటుపూజలు నిర్వహించుకున్నారు. దర్శనానంతరం ఆయనకు గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించి వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో పిఆర్ఓ సతీష్‌మాలిక్, లోకేష్‌రెడ్డి, ఏపిఆర్ఓ రవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌నాయుడు, సుబ్రమణ్యం, సుదర్శన్‌రెడ్డి, మరియు వేదపండితులు మరియు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## వరదబాధితులను ఆదుకున్న తెలుగుదేశంపార్టీ నేతలు

తొట్టంబేడు, డిసెంబర్ 7 ప్రభాతవార్త



వరదభాదితులకు నిత్యావసర వస్తువులను శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్, దివంగత నేత పోతుగుంట గురవయ్యానాయుడు కుమారుడు డాక్టర్ పోతుగుంట రాజేష్‌నాయుడు మండలంలోని ఇలగనూరు ఎస్టీ కాలనీలో గత వారంరోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఇంటి నుంచి బయటకు రాని పరిస్థితుల్లో ఉన్న సుమారు 50కుటుంబాలకు పైగా నెలరోజులకు సరిపడా బియ్యం, పప్పుదినుసులు, ఇతర వస్తువులు అందించి అధైర్యపడకుండా ఉండాలని తాను అండగా ఉంటానని కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. ఏసమస్య వచ్చినా తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పంపిణీ క్యార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షులు ప్రకాష్‌నాయుడు,తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి రాఘవులుయాదవ్, ఎస్సీ సెల్ నాయకులు బాలసుబ్రమణ్యం, బూత్ కన్వీనర్ సుశేఖర్‌నాయుడు, మాజీ సర్పంచ్ మధునాయుడు, మాజీ జడ్పీటిసి సుబ్బరామయ్య, శివ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇలగనూరు ఎస్టీ కాలనీ హరిజనవాడకు చెందిన నాగరాజు సతీమణి నరసమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## ఆత్మహత్య పథకం జగనన్న పదోరత్నమా..తెదేపా ధ్వజం


శ్రీకాళహస్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త



మాట తప్పను, మడమ తిప్పను అని ప్రగల్భాలు పలికి మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు ఆత్మహత్య పథకం అనే పదోరత్నాన్ని కూడా అనధికారికంగా అమలు చేస్తున్నట్లు ఉందని తెలుగుదేశంపార్టీ నాయకులు ఆరోపించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనంతగా తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల్లో కరువు కోరల్లో చిక్కుకున్న రైతాంగానికి జగన్‌రెడ్డి ప్రభుత్వం బాసటగా నిలవకపోవడం అత్యంత బాధ్యతారాహిత్యం అని తెలుగుదేశంపార్టీ నాయకులు ఆరోపించారు. ఖరీఫ్‌లో తగినంత వర్షాలు కురవక రైతులకు నీటి లభ్యత లేక పంటలు వేసుకోలేని దిక్కులేని పరిస్థితుల్లో ఉంటే కనీసం స్పందించని సిఎం జగన్‌రెడ్డి తన పార్టీ పేరులో మాత్రం రైతు పదాన్ని పెట్టుకుని రైతాంగానికి చావును పరిచయం చేస్తున్నాడని తెదేపా నాయకులు ఆరోపించారు. కరువు కారణంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులలకు ఊహించని విధంగా మిచాంగ్ తుఫాను కారణంగా అక్కడక్కడా వేసుకున్న పంటలు కాస్తా తుడిచిపెట్టుకునిపోయి తీవ్రమైన కష్టాలను తెచ్చిపెట్టిందని తెలుగుదేశంపార్టీ నాయకులు ఆవేదనవ్యక్తం చేశారు. కరువు కోరల్లో చిక్కుకున్న రైతాంగానికి కనీస సాయం చేయకుండా గాలికి వదిలివేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వం, నష్టాల్లో కూరుకుపోయిన రైతుల బలవన్మరణాలకు కారణమవుతూ నవరత్నాలతోపాటుగా ఆత్మహత్య పథకం అనే పదోరత్నాన్ని జగన్‌రెడ్డి అమలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటకాలువలకు మరమ్మత్తులు చేసి నీటి పారుదల వ్యవస్థను యుద్ధప్రాతిపదికపై సరిచేయడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి, వన్నెకులక్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్‌రవి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రమణ్యం(బుజ్జి), తిరుపతి పార్లమెంటు మైనార్టీ విభాగం తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి షేక్‌జిలానీ, తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు, మునిరాజయాదవ్, రమేష్, శివకుమార్, మహ్మద్‌రఫీ, సులేమాన్, ఫఠాన్ మహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణంపల్లి గ్రామంలో సిపాయిభరోసా

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్), డిసెంబర్ 7 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలోని కృష్ణంపల్లి గ్రామంలో మృతిచెందిన పి.సులోచనమ్మ కుటుంబాన్ని ఎంఎల్సి, రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం మృతిచెందిన సులోచనమ్మ కుమారుడు పి.వెంకటమునిరెడ్డికి సిపాయి భరోసా కింద 40రకాల నిత్యావసర సరుకులు పంపిణీచేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాబు, ఏర్పేడు మండల వైకాపా నాయకులు సర్పంచ్ రాజేశ్వరి, గెరటారెడ్డి, బలరామిరెడ్డి, మురగారెడ్డి, దాము, పెంచలరెడ్డి, చలపతి, మునిరెడ్డి, మునిరామిరెడ్డి, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రత్యేక ప్రతిభావంతులపై తల్లిదండ్రుల శ్రద్ధ తప్పనిసరి

ఎంఈఓ శ్రీవరం లలితకుమారి

చంద్రగిరి, డిశంబర్ 7 ప్రభాతవార్త:



ప్రత్యేక ప్రతిభావంతులపై తల్లిదండ్రులు సైతం శ్రద్ధ చూపడం తప్పనిసరి అని ఎంఈఓ శ్రీవరం లలితకుమారి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే అత్యుత్తమ ఫలితాలు సాధించగలరని అన్నారు. వీరిలో శారీరకంగా ఏర్పడిన లోపాన్ని అధిగమించి ఉత్తమ పౌరులుగా రాణించడంలో తెలివితేటలు చక్కగా దోహదపడగలవన్నారు. పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ క్రమం తప్పకుండా అందించాలని శ్రీపద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠాల హెచ్ఎం పి.వెంకటరమణ రెడ్డి అన్నారు. పిల్లల్లోని ప్రతిభను వెలికితీయడంలో భాగంగా చిన్నారులతో సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లలకు, పేరెంట్స్‌కు తుమ్మలగుంట భీమా భాస్కర్ మధ్యాహ్నం రుచికరమైన భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.భాస్కర్ బాబు, సహిత విద్య ఉపాధ్యాయులు ఎస్.శ్యామలాదేవి, ఎన్.వెంకట రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

-ప్రజారవాణా జిల్లా అధికారి చెంగల్‌రెడ్డి

తిరుపతి,డిసెంబర్ 7ప్రభాతవార్త:



తిరుపతి ఆర్టీసి రీజియన్‌లో వివిధ డిపోల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సిబ్బంది సమస్యలు పరిష్కా రానికి అధికారులు కృషి చేయాలని, వారికి ఇబ్బందులు కలగకుండా సమిష్టిగా పనిచేయాలని జిల్లా ప్రజారవాణా అధికారి టి.చెంగల్‌రెడ్డి సూచించారు. గురువారం తిరుపతి ప్రజారవాణా కార్యాలయంలో అన్ని డిపోలకు చెందిన పర్సనల్ డిపార్టుమెంట్, అకౌంట్స్‌డిపార్టుమెంట్‌లకు సంబంధించిన సూపర్‌వైజర్లు, అకౌంటెంట్‌లతో సమావేశమయ్యారు. డిపోల్లో పరిష్కారానికి నోచుకోని సమస్యలను పరిష్కరించే దిశగా సూపర్‌వైజర్లు చూడాలన్నారు. శ్రీకాళహస్తి డిపోలో మృతిచెందిన ,విశ్రాంతి పొందిన ఉద్యోగుల సెటిల్‌మెంట్లు త్వరగా పూర్తిచేసేందుకు డిపో పర్సనల్ డిపార్టుమెంట్ సూపర్‌వైజర్ కె.కామేష్, అకౌంట్ డిపార్టమెంట్ సూపర్‌వైజర్ జిఎస్ నాయుడు చూడాలని ఆదేశించారు.తిరుపతి రీజియన్ పర్సనల్ అధికారి పార్థసారధి,అకౌంట్స్ అధికారి చంద్రమణి ,డిపోల అధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల పిల్లల పట్ల శ్రద్ధ అవసరం

: జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్

నారాయణవనం, డిసెంబర్ 7 ప్రభాతవార్త :



దివ్యాంగుల పిల్లల పట్ల ప్రభుత్వానికి ప్రత్యేక శ్రద్ధ వుందని, అలాగే పిల్లల తల్లితండ్రులు కూడా వారి పిల్లల పట్ల మంచి ప్రవర్తనతో నడుచుకోవాలని జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంఇఓలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామిలు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని మెయిన్ స్కూల్‌లో గురువారం జాతీయ దివ్యాంగు పిల్లల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల పట్ల చిన్నచూపు చూడరాదన్నారు. సమగ్ర శిక్ష అందిస్తున్న సదుపాయాలను, ఇంటి వద్దకు విద్య, ఎస్కార్ట్ అలవెన్స్, అందత్వం కలిగిన విద్యార్థులకు రీడర్ అలవెన్స్ వంటి అనేక రకాల సదుపాయాలను కల్పిస్తున్నట్టు చెప్పారు. సమాజంలో వారిని కూడా మంచి స్థితికి తీసుకురావడానికి చేయాల్సిన వ్యాయామాలను చేయించాలన్నారు. అనంతరం ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబులు, 3 వీల్ ఛైర్స్. ట్రై సైకిల్స్ అందజేశారు. నగరి లైన్స్ క్లబ్ సభ్యులు జీవన్ ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు భోజనం పేట్లు, ఉచితం భోజనం, శీతలాపానీయం అందజేశారు. అలాగే చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శారదమ్మ గణేషన్, ఎంపిటిసి రాధా మోహన్, స్కూల్ ఛైర్మన్ టికె గణేష్‌బాబు, బాలుర హైస్కూల్ హెడ్‌మాస్టర్ సులోచన, మెయిన్ స్కూల్ హెచ్ఎం రోసి మందడి, సహిత ఉపాధ్యాయులు పి.విజయన్, బి.భరత్, సిఆర్‌పిలు, ఎఆర్‌సిలు, టీచర్లు, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## తుఫాను బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- నరసింహులుయాదవ్

పిచ్చాటూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త:



మిచౌంగ్ తుఫాను వల్ల నష్టపోయిన అన్ని వర్గాల వారిని ఆదుకోవాలని టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహులు యాదవ్ ఆరోపించారు. ఈ సందర్భంగా పిచ్చాటూరులో మండల టీడీపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాను బాధితులను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహించారు. మండలంలోని రామగిరి, రామాపురం, పిచ్చాటూరు తదితర గ్రామాల్లో పట్టా భూములు తుఫాను వరదలు వల్ల నాలుగు అడుగులు మేరకు కోతకు గురైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తుంటే జగన్ వారి మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం ఎంత వరకు సమంజసం అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు హెక్టార్‌కు రూ.20 వేలు అందించామని అదే వైసీపీ హయాంలో గతంలో వచ్చిన వరద బాధిత రైతులకు రూ.15 వేలు అందించారని, కానీ ప్రస్తుతం హెక్టార్‌కు రూ.30 వేలు అందించాలన్నారు. ఇకనైనా అధికారులు సమగ్ర సర్వే చేసి నష్టపోయిన అన్ని వర్గాల వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్, మండల క్లస్టర్ ఇళంగోవన్‌రెడ్డి, నారాయణవనం మండల టీడీపీ అధ్యక్షుడు గిరిబాబు, సత్యవేడు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు అరుల్ ప్రకాష్, టీడీపీ నాయకులు పద్దురాజు, వాసు, చిన్న, జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శి రవి, నారాయణవనం మండల క్లస్టర్ షణ్ముగం తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ

పిచ్చాటూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త:



మిచౌల్ తుఫానుతో రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉన్న శివగిరి ఆది ఆంధ్ర వాడ వాసులకు గురువారం తహసీల్దార్ మధుసూదన్‌రావు అధికార పార్టీ నాయకులతో కలసి నిత్యావసర వస్తువులు అందించారు. 25 కేజీల బియ్యం, ఒక లీటరు పామాయిల్, ఒక కేజీ రెడ్ గ్రామ్‌లతో పాటు ఒక యూనిట్ ఫ్యామిలీకి వెయ్యి, ఇద్దరి యూనిట్ ఫ్యామిలీకి 2 వేలు, అంతకు మించి ఉన్న ఫ్యామిలీకి 2500లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రావు, పిచ్చాటూరు మండల వైసీపీ అధ్యక్షుడు కె.వి.చలపతిరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.భాస్కర్‌నాయుడు, ఉపాధ్యక్షులు రమేష్‌రాజు, సర్పంచ్ కిరణ్‌నాయుడు తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## కేంద్రం పథకాలపై అవగాహన

-లబ్ధిదారులకు చేరవేత

సత్యవేడు, డిశంబరు 7, ప్రభాతవార్త :




తొమ్మిది సంవత్సరాల కాలంలో భారతీయ జనతాపార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ అర్హత కల్గిన లబ్ధిదారులకు పథకాలను చేరవేసే ఉద్దేశ్యంతో వికసిత్ సంకల్ప యాత్ర ప్రారంభించినట్లు ఆపార్టీ మండల అధ్యక్ష్యుడు మునిప్రతాప్ తెలిపారు. దేశవ్యాప్తంగా కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో సత్యవేడు మండలంలో కూడా 28 గ్రామ పంచాయితీలలో యాత్ర సాగనున్నట్లు ఆయన వివరించారు. నేటి నుంచి డిశంబరు 22వ తేది వరకు కార్యక్రమం సాగుతుందన్నారు. దీనిపై గురువారం స్థానిక ఎంపిడివో చంద్రశేఖర్ ను కలిసి కార్యక్రమ నిర్వాహణపై చర్చించారు.మండల ప్రధానకార్యదర్శి మురళికృష్ణ, ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు మునికృష్ణయ్య, మాజీ ఎంపిటీసిలు మోహన్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## తుఫాన్ బాధితులకు ఆర్థిక సాయం

తిరుపతిరూరల్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



తుఫాన్ ముంపు బాధితులకు ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయాన్ని రెవెన్యూ అధికారులు అందజేసారు. గురువారం తిరుమలనగర్ పరిధిలోని కె.బి.ఆర్ నగర్‌లో ముంపు నిర్వాసితులకు విఆర్వో భూపతి ఆచారి ఆర్థిక సాయం అందజేసారు. ముంపుకు గురైన బాధిత కుటుంబానికి రూ.2500రుపాయాలు చొప్పున అందజేసారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు శివశంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

